# మ రీ చి క

ఘాట్ సెక్షన్‌లో నుంచి ట్రెయిన్ దూసుక వెడుతోంది! రెండువేపులా ఎత్తైన కొండలు, ఆకాశాన్నంటేలా వున్నాయి! ట్రెయిన్‌లో సెకెండ్ క్లాస్ కంపార్ట్ మెంటులో కూర్చుని కిటికీ లోంచి బయటికి చూస్తున్న పార్వతమ్మ కళ్లు గట్టిగా మూసుకుంది! ఎటువేపు చూచినా ట్రెయిన్ ఒరుసుకుంటున్నట్లున్న కొండలు! ఆమె గుండె దడదడ కొట్టుకోంటోంది వేగంగా! ఈ ఘాట్ సెక్షన్‌లో, ఇంత ఇరుకుత్రోవలో ఇలా వెడ్తున్న ట్రెయిన్‌కు ఎదురుగా, మరేదేనా ట్రెయిన్ వస్తే? ప్రమాద వశాత్తూ ఈ రెండూ ఢీకొంటే? అమ్మయ్యో!

"ఛీ! పాడు ఆలోచన! అలా ఎందుకు జరుగుతుంది?" తన వెర్రి ఆలోచనలకు తనే మందలింపుగా అనుకుంది పార్వతమ్మ!

ఎదుటి బెర్త్ మీద పడుకుని భార్యవాలకం గమనిస్తున్న విశ్వనాథం, ఆవిడ మనసులో మెదులుతున్న ఆలోచనల రూపు రేఖలు పసిగట్టగలిగాడు!

"పార్వతీ! నిద్ర రావటంలేదూ! అలాభయపడ్తూ, మూల ఒదిగి కూర్చోకపోతే, హాయిగా బెర్త్ మీద పడుకో! ఈ ఘాట్ సెక్షన్ దాటాక, చక్కని ప్రకృతిదృశ్యాల బాటలో వెడుతుంది ట్రెయిన్! అప్పుడే నిద్రలేపుతాను! చూద్దూగానీ"

అన్నాడాయన మెల్లిగా ! ఓ వేపు భార్య మానసిక పరిస్థితికి జాలికూడా ముంచుకవస్తోం దాయనకు !

"అలాగే !" నిర్లిప్తంగా అని బెర్త్‌మీద పడుకుంది పార్వతమ్మ ! విశ్వనాథం క్షణంలో గుర్రుపెట్టడం మొదలెట్టాడు ! పార్వతమ్మకుమాత్రం నిద్రరావటంలేదు ! మనస్సు కళ్లెంలేని గుర్రంవంటి దంటారు ! మరీ పనిలేని సమయాలలో మనస్సు చేసే అల్లరి అంతాఇంతాకాదు ! కోతిపిల్లలా గెంతటమే, దెయ్యంలా వికృతమైన ఆలోచనలు చెయ్యటమే, లేడిలా పరుగులు తియ్యటమే, సింహంలా భయంకరంగా గర్జించటమే, మదపుటేనుగులా కసిగా త్రొక్కటమే, చిరుతపులిలా పొంచిపొంచి లంఘించటమే, నాగుబాములా బుస్సున పడగ విప్పి కాటువేయటమే, సాధుపుంగవునిలా బోధలుచెయ్యటమే, మాంత్రికునిలా గత స్మృతులతో ఇంద్రజాలం ప్రదర్శించటమే, ఒకటేమిటి, ఆ మనస్సు చెయ్యని పనిలేదు, ఆలోచనలేదు ! అందుకే అంతటి చంచలమైన మనస్సును అదుపులోకి తేవటం, మహామహులకే సాధ్యంకాలేదు ! సాధ్యమై సాధించినవారు మాత్రం మహాత్ములనటంలో, మానవాతీతులనటంలో సందేహం లేదు !

పార్వతమ్మ మనస్సు సరిగా కళ్ళెంవదిలిన గుర్రంలా మారింది! గతస్మృతులు నీడల్లా, దృశ్యాలుగా, గొలుసుకట్టులా మనో నేత్రాలముందు మెదలటం మొదలెట్టాయి ! ఈగల్లా ముసురుకుంటున్న ఆలోచనలను అదుపులో పెట్టాలని విఫల ప్రయత్నం చేస్తోందామె ! ఏదో చిన్న స్టేషన్‌లో ఒక్క కుదు

పుతో రైలు ఆగింది! కుతూహలంగా లేచికూర్చుంది పార్వతమ్మ!

ఎవరో ఓ యువతి గబగబ కంపార్ట్ మెంటులోకి ఎక్కింది! ఫ్లాట్ ఫారంమీద నిల్చునివున్న యువకుడు, ఆమెభర్తకాబోలు, ముందస్తగా చంటిపాపను అందించాడామెకు! బొద్దుగా, అందంగావున్న సంవత్సరం నిండని ఆ పాపను ఆ యువతి గబ గబ పార్వతమ్మ ప్రక్కన పడుకోబెట్టింది! "సామాన్లూ, పిల్లలూ ఎక్కగానే పాపను తీస్తానులెండి!" అందాయువతి పార్వ తమ్మతో సంజాయిషీ చెప్పుకుంటున్నట్లు!

పార్వతమ్మ నొచ్చుకుంది ... "ఫర్వాలేదండీ! పాపా యిని పడుకోబెడితే నాకేమీ కష్టంలేదు!" అంది.

వరసగా మరోఇద్దరు మగపిల్లల్ని అందించాడు ఆమె భర్త! ఆమె అందుకుంది! సామాన్లు లోపలపెట్టి అతగాడూ ఎక్కాడు! ట్రెయిన్ కదిలింది! సామాన్లు ఓ ప్రక్కగాసర్ది, అవతలివేపున్న బెర్త్సమీదకు పిల్లల్ని మార్చాడు అతగాడు.

పాపను తీసుకొని వెళ్ళబోయిన ఆ యువతిని వారిం చింది పార్వతమ్మ "ఒద్దండీ! పాపను నిద్రలో కదిలించకండి! నాకేం అసౌకర్యం లేదు!" ఏదోపెన్నిధి హఠాత్తుగా తన ఒడిలోకి వచ్చినట్లూ, అది తనకు దక్కదేమోననే ఆవేదనతో కొట్టుకులాడుతున్నట్లూ ధ్వనిస్తోంది పార్వతమ్మ కంఠస్వరం!

ఆ యువతి స్నేహపూర్వకంగా నవ్వింది. "అలాగే వుంచండి!" ఆమె వెళ్లి పిల్లలిద్దరి మధ్యా కూర్చొని, నిద్రపో తున్న పిల్లలిద్దరిమీదా చెరోచెయ్యీ వేసి బెర్త్కు అనుకుని

కూర్చునే కునుకు పట్టించింది ! ఆవిడ భర్త అప్పుడే నిద్రలోకి జారిపోయాడు !

ప్రక్కనే ప్రశాంతంగా పడుకుని నిద్రపోతూ, నిద్రలో నవ్వుకుంటున్న పాపాయిమీద ఆప్యాయంగా చెయ్యివేసింది పార్వతమ్మ ! క్షణకాలం పాప త్రుళ్ళిపడి తిరిగి నిద్రపోయింది ! పాప అలా ఉలికిపడినప్పుడు పార్వతమ్మ చేతినుంచి, ఆమె హృదయం వరకూ ఏదో విద్యుత్తు స్పర్శన ప్రసరించి, ఆమెలో ఎన్నో సంవత్సరాలుగా ఉప్పొంగి ఉప్పొంగి నీరసించిపోయిన మాతృత్వపు ఆకాంక్షను తిరిగీ తట్టిలేపినట్లయ్యింది ! ఆమె తలెత్తి ఎదర బెర్త్‌మీద ప్రశాంతంగా జోగుతున్న ఆ యువతి వేపు చూచింది ! ఆ వదనంలో ఎంతటి పరిపూర్ణత గోచరిస్తోంది! ఎంత తేజస్సు ! కాయలతో, పండ్లతో, పూలతో నిండివున్న వృక్షంలా ఆ యువతి ఎంత మనోజ్ఞంగా వుంది! పిల్లలు నిద్రలో క్రిందపడతారేమోననే భయంతో కాబోలు, అవిడ ఆ ఇద్దరిమీదా చేతులు వేసి కూర్చుని నిద్రపోతోంది !

తన జీవితంలో ఇలాంటి ఘట్టం వస్తుందా ? ఏమో ? త్రుళ్ళగొట్టబడిన నీళ్ళలా పార్వతమ్మ ఆలోచనలు మళ్ళీ విజృంభించాయి ! ఆమె మనస్సు గతాన్ని దృశ్యాలుగా చూపుతోంది ! చేసేదిలేక ఆమె ఆ దృశ్యాలనే చూస్తోంది !

సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం !

పద్దెనిమిది సంవత్సరాల పార్వతి మెడలో మంగళ సూత్రం ముడివేశాడు విశ్వనాథం ! రూపంలో, ఒడ్డూపొడవులో, చదువూ, సంస్కారంలో, పార్వతి, విశ్వనాథంల జంట

చూచేవారికి అసూయ కలిగించేలా వుండేది ! ఇద్దరికిద్దరూ నవ దంపతులు తియ్యటి కలల్లో తేలిపోతూండేవారు అనుక్షణం.

దాంపత్య జీవితంలోని మధురానందం మత్తెక్కిస్తుంటే, పార్వతికి కాలగమనం కూడా తెలిసేదికాదు! మూడేళ్ళు గిర్రున తిరిగాయి. సంక్రాంతికి భర్తతోబాటు పుట్టింటికి వచ్చింది పార్వతి! ఆ రోజు సాయంత్రం సినిమాకు వెళ్ళాలను కుని బయల్దేరారు విశ్వం, పార్వతి! గుమ్మంలోకి వచ్చీ రాగానే ఎదురయ్యింది, పార్వతి చిన్ననాటి స్నేహితురాలు నీరజ! చంకలో రెండేళ్ళ పాపతో! "బొమ్మల కొలువు పెట్టాను పారూ ! పేరంటానికి రావాలి !" అంది పార్వతి నుదుట బొట్టు పెడుతూ! నీరజ వైపు పరీక్షగా చూస్తున్న పార్వతి రహస్యంగా అడిగింది..."మళ్ళీ ఏదైనా ?" అని.

నీరజ నిట్టూర్చింది! "హూం! ఈ చంకలో పిల్లకు సరిగా రెండేళ్లు నిండాయో లేదో, అప్పుడే నాకు మళ్లీ ఐదో నెల జరుగుతోంది పార్వతీ ! ఎంతైనా నువ్వదృష్టవంతురాలివి! మాలా పుస్తె ముడిపడగానే, ఒడిలో పిల్లలు బయల్దేరకుండా, హాయిగా మీ రిద్దరూ చిలకా గోరింకల్లా స్వేచ్ఛగా, సినిమా లకూ షికార్లకూ వెళ్తుంటే, నువ్వేమైనా అనుకో, నాకు అసూయ కలుగుతుంది పార్వతీ! ఊ! ఈ మాటలకేంలే ! పిలవాల్సిన యిళ్ళు చాలా ఉన్నాయి! మరి నే వెళ్ళిరానా!" అంది నీరజ! తలూపింది పార్వతి! నీరజలా వెళ్ళగానే విశ్వం పార్వతి దగ్గరసా వచ్చాడు! "ఏమంటోంది మీ స్నేహితు రాలు ?" అన్నాడు నవ్వుతూ.

పార్వతి హేళనగా నవ్వింది. "పెళ్ళై మూడేళ్ళు తిరక్కముందే యిద్దర్ని ప్రొడ్యూస్ చేసింది!" అంది.

"అయ్యబాబోయ్! ఈ లెక్క ప్రకారం పదేళ్ళు తిరిగే సరికి మీ స్నేహితురాలు పుట్టించే పిల్లలసంఖ్య......" ఇల్లెగిరిపోయేలా నవ్వుతున్న భర్త నవ్వులో శృతి కలిపింది పార్వతి!

ఆరోజు రాత్రి సినిమానుంచి వచ్చి, పడుకోబోతూ, భర్తచేతులు తన చుట్టూరా వుంటే, తన్మయత్వంతో పొంగిపోతున్న పార్వతి మనసులోనే ఇలా అనుకుంది. "భగవాన్! నా కీ అదృష్టం ఇలాగే వుంచు! నీరజకులా, ఏడుస్తూ మొత్తుకుంటూ వెంటపడి తిరిగే వెధవ పిల్లలు నాకొద్దు!" ఆమె కోర్కె భగవంతుడు విన్నందుకు గుర్తు అన్నట్టుగా, ఇంట్లోని గోడ గడియారం ఠంగున పదకొండున్నర కొట్టింది!

కాలచక్రం గిర్రున తిరిగింది! మరో నాలుగేళ్లు గిరగిర తిరిగాయి! పార్వతికి ఏలోటూ కనిపించటంలేదు జీవితంలో! విశ్వం పెద్ద ఉద్యోగంలోకి వచ్చాడు. అతడు నవమన్మథుడైతే, పార్వతి రతీదేవి! ఏ చీరె కావాలంటే ఆ చీరె, ఏ సొమ్ము కావాలంటే ఆ సొమ్ము, ఏ విలాసం కావాలంటే ఆ విలాసం అనుకున్న క్షణంలో నెరవేర్చుకో గలుగుతున్నా రిద్దరూ! పెద్ద బంగళాలాటి ఇల్లు కొన్నారు! అధునాతన వస్తుసామగ్రితో దాన్ని అలంకరించారు!

ఒసారి పార్వతి చెల్లెలు లలిత, లలిత భర్త, పిల్లలు, ట్రాన్స్ఫర్ మూలంగా, ఆ వూరిమీదుగా వెళ్ళాల్సివచ్చింది!

పార్వతి కోరికపై, లలిత, పిల్లలు ఓ వారంరోజులు పార్వతి ఇంట్లో వున్నారు !

లలితకు నలుగురు పిల్లలు ! పిల్లలతో, చాకిరితో, రోగాలతో, రొప్పులతో పార్వతికంటే మూడేళ్లు చిన్నదైన లలిత, పార్వతికంటె పదేళ్లు పెద్దదానిలా కన్పిస్తోంది ! "అబ్బబ్బ ! ఛస్తున్నానంటే నమ్మక్కయ్యా ఈ పిల్లలతో ! హాయిగా నువ్వు, బావ అదృష్టవంతులు ! మాకు చూడు ! ఆయనగారికి, అంటే మీ మరిదిగారికి, నెలసరి జీతం ఆరొందలు వస్తుందని పేరేగాని, మచ్చుకి నీలా ఒక్క నగైనా చేయించుకో గలుగుతున్నానా ? ఓ సరదా వుందా ? ఏం జీవితమో ఏం పాడో ? అస్తమానూ ఈ పిల్లల రోగాలకు వందలకొద్ది డబ్బు గుప్పించాలి ! నా కాన్పులూ, తెగుళ్ళు సరేసరి ! నీలా నా జీవితంలో స్థిమితమూ, సుఖమూ లేదక్కయ్యా !" అంది లలిత విసుగ్గా ఓ రోజు !

ఆ క్షణంలో పార్వతికీ తనెంతో ఉన్నతంగా, అందరికీ అందుబాటులో లేని, వుండని అదృష్ట జాతకురాలిగా అనిపించింది ! కాని ఈ సంభాషణ వింటున్న విశ్వం ప్రక్కగదిలోంచి బయటికి వచ్చాడు.

మరదలి నుద్దేశించి "అలా అనకమ్మా లలితా ! నీకున్న కలిమివిలువ నీకుతెలియటంలేదు ! ఆ నలుగురు బిడ్డలూ ఎంత కలిమో నీకు తెలుసా ? మాకు ఇంత వుంది ! ఏదో అదృష్టమని నువ్వు భ్రమపడ్తున్నావే గానీ, నోరారా 'అమ్మా ! నాన్నా !' అని ముద్దుగా పిల్లలు పిలుస్తుంటే పొంగిపోవటంలో వున్న అదృష్టం మాకేదీ ?" అన్నాడు.

భర్తవేపు విస్మయంగా చూసింది పార్వతి! ఈ మధ్య విశ్వం తరచూ, "పార్వతీ! ఒక్క బిడ్డయినా లేకుంటే, యిల్లు కళగా వుండదు కదూ?" అంటున్నాడెందుకో! అలా అంటూంటే పార్వతికి చిరాకు కలుగుతుంది కూడా! ఇప్పుడు తమ యింటి కళకేం తక్కువైందని ఆయనగారి కా బాధ?

బావగారివేపు ఆశ్చర్యంగా చూచి మాట మార్చేసింది లలిత. లలిత, లలిత పిల్లలు వున్న వారం రోజుల్లోనూ, ఆ పిల్లల గోల భరించలేక, పార్వతి చిరాకు అంతా యింతా కాదు! అన్నం తినేటప్పుడూ - ఒకటేమిటి అస్తమానూ వాళ్లు కోతుల్లా రచ్చచేస్తుంటే పార్వతికి తగని చిరాకు వేసేది!

లలిత, లలిత పిల్లలు ఊరి కెళ్ళిపోయిన రోజు రాత్రి పార్వతి హాయిగా నిట్టూర్చింది! నిద్రకుపక్రమించ బోతున్న భర్తతో... "అబ్బబ్బ! నా చెల్లెలు కానీండి, మరొకళ్ళు కానీండి...ఆ వెధవ సంతానంతో నానా రచ్చచేసారు! ఎక్క డెక్కడి సామాన్లూ విరగ్గొట్టారు! ఇల్లంతా ఓ కొలిక్కి తెచ్చారు! అవన్నీ ఎక్కడి వక్కడ సర్దేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చిందీ రోజు! కాకున్నా, మనస్ఫూర్తిగా చెబుతు న్నాను సుమండీ... జన్మ జన్మలూ గొడ్రాలిగానేనా ఉంటాను గానీ ఈ వెధవ పిల్లలు నా కొద్దు..."

పార్వతి నోటిలో నుంచి ఆఖరు మాట వెలువడటమే తరువాయి, విశ్వం గొంతు గదంతా ప్రతిధ్వనించింది, "పార్వతీ!" అంటూ. ఆ గర్జనలో బాధ, కోపం, సమ పాళ్ళల్లో సమ్మిశ్రితమై వున్నాయి!

తనన్న మాటలు మరోసారి మననం చేసుకుంది పార్వతి! అందులో ఏం తప్పుందో అంతుబట్ట లేదు! భర్త కంత కోపం రావాల్సిన అవసరమూ బోధపడలేదు పార్వతికి!

మరో నాలుగేళ్లు గడిచిపోయాయి! విశ్వం విశ్వ నాథంగా మారిపోయాడు. పార్వతి పార్వతమ్మగా మారింది! ఇప్పుడిప్పుడే పార్వతికి తన గృహంలో, తన మనసులో ఏదో సన్నని వెలితి స్పష్టంగా గోచరిస్తోంది!

విశ్వనాథం ఆఫీసుకు వెళతాడు ఉదయం పదిన్నరకల్లా! సాయంత్రంగానీ ఇంటికి రాడు! వచ్చినా ఏ క్లబ్బుకో వెళ్ళి పోతాడు! మునుపటిలా, అతగాడితో బాటు తనూ తయారై సినిమాలకో, షికార్లకో వెళ్లటానికి వయస్సు, సంఘంలో పేరు ప్రతిష్ఠలూ, అడ్డొస్తున్నాయి! పైగా తనకూ అంత హుషారుగా లేదు అలాటివాటికి! ఇక ఉదయం పదిన్నరనుంచి అస్తమానూ ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని డిజైన్లు కుట్టినా, ఎన్ని వ్యాపకాలు పెట్టుకున్నా పొద్దుపోవటంలేదు! దానికి తోడు ఇన్నేళ్ళుగా తనలో తనకే తెలియని మరో స్త్రీ రూపం మాతృప్రేమకోసం వత్తిడి చేస్తోంది! వీధిలో పోయే ఏ తల్లిని చూచినా, తల్లి ప్రక్కన నడుస్తుండే ముద్దులొలికే బిడ్డను చూచినా, పార్వతమ్మకు ఏదో బాధ రేగుతోంది! పశు పక్ష్యాదులు మొదలు మానవకోటివరకూ, సకల చరాచర జీవ రాసులలో నిబిడీకృతమైయున్న ఈ సృష్టిరహస్యం, సృష్టి విధానం, మాతృప్రేమ, అందులోని పరిపూర్ణత ఆమెకు స్పష్టంగా సాక్షాత్కరించి మనసును కలవరపరుస్తున్నాయి!

ఇప్పుడిప్పుడే తన యవ్వనంలోని పిచ్చికోరికలకు దుఃఖము కలుగుతోంది !

తను కోరిన ప్రతి కోరికా భగవంతునికి వినిపించిందా ? 'పిల్లలొద్దు' అంటూ ఆ మైకంలో తను అరచిన అరుపు దేవుడు విని నిజంచేశాడా ? తన కిక పిల్లలు కలగరా ? తన జీవితానికీ, స్త్రీత్వానికీ పరిపూర్ణత లభించదా ? ఇలాంటి ఆలోచనలే పదే పదే వేధిస్తున్నాయి ఆమెను !

"పార్వతీ ! మీ చెల్లాయి, లలిత, పిల్లలు వస్తున్నారట జాబు వచ్చింది !" అన్నాడు విశ్వనాథం ఒకరోజు.

"పిల్లలు" అన్నమాట ఎందుకో ఆనందాన్ని కల్గించింది ఆమెకు.

ఈ సారి లలిత పిల్లలు చేసే అల్లరి బాధాకరంగా తోచలేదు పార్వతికి ! ఆ పిల్లల గోలతో ప్రతిధ్వనిస్తున్న తన యింట్లో లక్ష్మీదేవి గలగల నాట్యం చేస్తున్నట్లు తోచింది దామెకు !

"అక్కయ్యా ! నువ్వదృష్టవంతురాలవే ... !" ఏదో చెప్పబోతున్న లలిత నోరు చప్పున మూసేసింది పార్వతమ్మ !

"అలా అనకు లలితా ! ఆ భ్రమలోనే నేనూ వుండే దాన్ని. కాని, ఈ రోజు నా కర్థమౌతోంది ! నే నెంత దురదృష్టవంతురాలనో !" ఆవేదనాభరిత కంఠస్వరంతో అంటున్న అక్క మాటలకు ఆశ్చర్యపోయింది లలిత.

"అదేమిటక్కయ్యా..." ఏదో అడగబోతున్న లలితను వారించింది పార్వతమ్మ.

"నీకు తెలీదు లలితా! మాతృత్వం వహించని స్త్రీ జీవితం ఎంత దుర్భరమో, ఎంత అసంపూర్ణమో నాకు తెలుస్తోందీనాడు! అయితే వచ్చిన తమాషా ఏమిటంటే, మనిషి ఎప్పుడూ తనకున్న దాని కంటే, ఎదుటివారి కున్నదేమిటో, అత్యంత ఆకర్షణీయంగా, అదృష్టంగా ఊహాగానాలు చేస్తుంటాడు! ఒకప్పుడు నే నేమిటో చాలా సుఖపడ్తున్నాననీ, ప్రపంచంలోని మహా అదృష్టవంతులలో అగ్రగణ్యురాలిననీ గర్వపడ్తుండేదాన్ని. ఈనాడు నా పరిస్థితి నాకు తెలిసొచ్చింది. పిల్లాపాపలతో కళకళలాడే ఏ గృహిణిని చూచినా, గృహాన్ని చూచినా స్వర్గం అక్కడే వుందనీ, అదృష్టదేవత వారనే కటాక్షించిందనీ, నాకు బాగా బోధపడిందీనాడు. కానీ నువ్వు నే నేమిటో అదృష్టవంతురాలి ననుకుంటున్నావు. లేదమ్మా లేదు. ఈ దురదృష్టం ఎవరికీ వద్దు." సజల నయనాలతో చెబుతున్న పార్వతమ్మ దుఃఖం ఆగలేదు. ఎలా ఓదార్చాలో అర్థంకాలేదు లలితకు.

వారంరోజుల తర్వాత లలిత ప్రయాణమై వెళ్లటానికి సిద్ధమైంది. వెళ్లే ముందురోజు లలిత పార్వతమ్మతో అంది.

"అక్కయ్యా! అసలీ ప్రయాణంలో అంతరార్థం ఏమిటో తెలుసా?"

"ఊహూ!"

"మా కీ పిల్లలదో బెడదలా ఉండేది ఇన్నాళ్లూ. ఇద్దరు పిల్లల్ని వాళ్ళ మేనత్త దగ్గర వదిలిపెడదా మనుకున్నాను!"

ఆశగా చూచింది పార్వతమ్మ! పోనీ తన దగ్గిరే వుంచుకుంటేనో? తనూ కడుపులో పెట్టుక చూచుకోదూ?

కానీ పార్వతమ్మ మనసులో భావం మనసులో వుండగానే లలిత అంది, "కానీ నువ్వు ఇలా చెబుతూంటే నాకూ జ్ఞానోదయ మౌతోంది! భగవంతుడు ప్రసాదించిన బిడ్డల్ని "పీడలు" గా భావించి మనకు మనం పెంచుకోగల అవకాశమూ, ఆర్థిక స్తోమతూ వుండీ కూడా, ఇతరుల దగ్గిర పారేసి, వాళ్ళను దూరం చేసుకోడం ఎందుకు? ఈ కలిమిని చేజేతులా జార విడుచుకోవడం అవివేకం గాదా?"

పార్వతమ్మ నిరుత్తరురాలైంది. లలిత ఇంకా చెబుతోంది. "అదీగాక అక్కయ్యా! నువ్వెన్నయినా చెప్పు! తల్లి చూచుకున్నట్లు పిల్లల్ని ఇతరు లెందుకు చూస్తారు? వాళ్ళ అల్లరి, తిండి, ఎందుకు భరిస్తారు? కోరికోరి ఆ బిడ్డల నెందుకు బాధలకు గురి చెయ్యాలి? అందుకే ఆ ఉద్దేశ్యం మానుకుని నా బిడ్డల్ని నా దగ్గిరే ఉంచుకుందామనుకుంటున్నాను."

లలిత వెళ్లిపోయాక ఇల్లంతా బోసిపోయినట్లుగా బాధ పడింది పార్వతమ్మ. పిల్లల అల్లరిలో దాగివున్న అనిర్వచనీయమైన ఆనందం మననం చేసుకోవటంతో ఆమెకు మరింత పిచ్చెక్కినట్లయ్యింది.

"నేనెంత అవివేకురాలినో, నా కోరికెంత మూర్ఖమైందో, నేనిలా గొడ్రాలిగా ఎలా జీవించాలో నాకు తెలుస్తోందిప్పుడు!" వలవల దుఃఖిస్తున్న పార్వతమ్మను మౌనంగా ఓదార్చాడు విశ్వనాథం.

అది మొదలు మొక్కని మొక్కు లేదు, తిరగని తీర్థం, దేవాలయం లేదు! కానీ ఫలితం శూన్యం! నలభై సంవత్సరాలు రాబోతున్న తనకిక పిల్లలు పుట్టే ఆశేమిటి?

ఏదో స్టేషన్‌లో ట్రెయిన్ ఆగింది. "అరె! త్వరగా దిగండి. ట్రెయిన్ కదుల్తుందో ఏమో!" కీచుగా అరుస్తున్న గొంతుకతో త్రుళ్ళిపడి కళ్ళుతెరచి చూచింది పార్వతమ్మ. అప్పటికి ఆమె ఆలోచన మత్తు మెల్లగా వదిలింది. అవతలివేపు కూర్చున్న ఆ దంపతులూ, పిల్లలూ దిగారు. తన ప్రక్కనున్న పాపను ఆవిడ దించుకుని వెళ్లింది. ట్రెయిన్ కదిలింది.

ఇన్ని తీర్థాలు తిరిగినా, ఇన్ని మొక్కులు మొక్కినా కలగని సంతానం, ఎవరో స్వాములవారు చిటికెడు విభూతి పెడితే కలుగుతుందా? అందుకే ఈ ప్రయాణం! పార్వతమ్మకు నవ్వొచ్చింది! ఏ వయసులో ఆ ముచ్చటన్నట్లు వయసులో లేని సంతానయోగం, స్వాములవారి విభూతితో సాక్షాత్కరిస్తుందా? ఏమిటి తమ ఈ ప్రయాణం? ఎక్కడికి? ముందున్నవి ఎండమావులని తెలుసు! అయినా ఈ పేరాస ఎందుకో?

మరీచికలను అన్వేషించుకుంటూ తను వెడుతోందా?

"ఓహ్! ముందున్నది మరీచికేనని తెలిసీ ఎక్కడికీ పరుగు?" లోలోపల అనుకోబోయిన పార్వతమ్మ పైకే అనేసింది. అప్పుడే మెలకువ వచ్చిన విశ్వనాథం ఆ మాటలు విని విస్మయంగా చూచాడు ఆమె వేపు! నిర్వికారంగా బెర్త్‌కు చేరగిలబడి వుందామె!